క్లుప్తంగా

సామూహిక సీమంతాలు



సారె అందజేస్తున్న శ్రీవిద్య, శ్వేత

ఖమ్మంవన్‌టౌన్: జాతీయ పోషణ మాసం సందర్భంగా శుక్రవారం ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ద్వారకానగర్ సెక్టార్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్లు పగడాల శ్రీవిద్య, ప్రశాంతలక్ష్మి, ఆళ్ల నిరీషారెడ్డిలు హాజరై పోషకాహార, చిరుధాన్యాల ప్రాముఖ్యత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారిణి కవిత, సూపర్‌వైజర్ సునీత, బీఆర్ఎస్ నాయకురాలు షకీనా, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు రైతులకు శిక్షణ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని రైతువేదికలో ఈ నెల 24న కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసే రైతులకు వ్యవసాయ ఉద్యానవన, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యాన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నగరంలోని ఇల్లెందురోడ్డు ఖానాపురంలోని ఖమ్మం ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌లో స్టాళ్ల కేటాయింపు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినోద్‌కుమార్

ఖమ్మం లీగల్: వచ్చే నెల 6, 7, 8వ తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ (డే–నైట్) పోటీలు జరగనున్నాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, న్యాయవాది బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో తాళ్లూరి సుహాస్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి దిలీప్‌చౌదరి, సిటీ సివిల్ కోర్ట్ న్యాయవాది దినేశ్‌చక్రవర్తితో కలిసి టోర్నమెంట్ పోస్టర్లను ఆవిష్కరించాక మాట్లాడారు. న్యాయవాదులకు మానసికోల్లాసం కలిగించాలని ఉద్దేశంతో ఈ టోర్నీ నిర్వహిస్తున్న తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

కామేపల్లి: గ్రామీణ ఉపాధి హామీ, ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటల పెంపకానికి, బిందు సేద్య పరికరాలకు ప్రభుత్వ ప్రోత్సాహకంతో పాటు రాయితీలను అందిస్తుందని వైరా డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఆకుల వేణు తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పండ్ల తోటలు పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ, ప్రోత్సాహకానికి సదరు రైతు ఉపాధి హామీ జాబ్ కార్డు, అనువైన భూమి, నీటి సౌకర్యం ఉండాలన్నారు. దీనికి చిన్న, సన్న కారు రైతులు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

తిరుమలాయపాలెం: నాణ్యతలేని మిర్చి విత్తనాలతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దమ్మాయిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్మిషన్ లేని నర్సరీలలో నాణ్యతలేకుండా విత్తనాలను అంటగట్టి రైతులను మోసం చేస్తున్నారని, అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, వీరస్వామి, అచ్చ ఉప్పలయ్య, నాగయ్య, బ్రహ్మాచారి, గద్దం శ్రీనివాసరెడ్డి, రామదాసు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ అంటోని
వినోద	ది నన్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	7జీ బృందావన కాలనీ
శ్రీనివాస	జవాన్

– ఖమ్మంగాంధీచౌక్

కుంకుమ పూజలు, అన్నదానాలు

గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అన్నదాన కార్యక్రమాలు, కుంకుమ పూజలను నిర్వహించారు. మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనగా.. పూజారులు వారిచే కుంకుమ పూజ చేయించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు విరాళాలు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



జయనగర్ కాలనీ ఆదిత్య ఇన్‌క్లావ్‌లో సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



ఖమ్మంఅర్బన్: ఇందిరానగర్‌లోని బాలగణపతి ఆలయం వద్ద డీసీసీబీ చైర్మన్ కూరాకుల



ఖమ్మంలోని టేకులపల్లిలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం రిటైల్ కూరగాయల మార్కెట్‌లో కుంకుమ పూజలు



ఖమ్మంమామిళ్లగూడెం: పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అభిలాషరావు, తదితరులు



ఖమ్మంగాంధీచౌక్: బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్‌లో కుంకుమ పూజలు



ఖమ్మంవన్‌టౌన్: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి



ఖమ్మంగాంధీచౌక్: బురహాన్‌పురం మేకల సంగయ్య వీధిలో కుంకుమ పూజలు



ఖమ్మంమామిళ్లగూడెం: 51వ డివిజన్ బుర్హాన్‌పురంలో కుంకుమపూజలు



కూసుమంచి: మల్లాయిగూడెంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్ నాయక్



నేలకొండపల్లి: బోదులబండలో పూజలు చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి



ఖమ్మంగాంధీచౌక్: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ బాలగంగాధర తిలక్



ఖమ్మంఅర్బన్: పోలీసుకాలనీలో కుంకుమపూజలో పాల్గొన్న కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి, తదితరులు

గణేశ్ మండపాలకు విరాళాలు..

ఖమ్మంరూరల్/కూసుమంచి/ తిరుమలాయపాలెం: పాలేరు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి విరాళాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఒక్కో విగ్రహానికి రూ.10వేల చొప్పున నియోజకవర్గంలోని 1,200 విగ్రహాలకు రూ.1.20 కోట్లు సొంత డబ్బును ఖర్చు చేస్తున్నారు. అంతేకాక ఎమ్మెల్యే సతీమణి విజయలక్ష్మి, కుమార్తె మండలాల వారీగా విగ్రహాలకు వద్దకు వెళ్లి కమిటీల బాధ్యులకు నగదు అందజేస్తున్నారు. ఎమ్మెల్యే ఔదార్యాన్ని పలువురు ప్రశంసిస్తుండగా ఉత్సవ కమిటీల బాధ్యులు, ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



కూసుమంచిలో విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్తె దీప్తి

సెల్ఫీ విత్ వినాయకా..



ముస్తాఫానగర్‌లో ఉషారాణి



బస్ డిపో వద్ద కృష్ణశాస్త్రి



సారథినగర్‌లో మల్లికార్జునరావు

వినతుల వెల్లువ..

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం వల్ల మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న, గాజుల నర్సింహారావు, సైదులు, ఈదన్న, ప్రభాకర్, రాము, శ్రీను పాల్గొన్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలి..

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యాన మండల తహసీల్దార్ రామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు మండడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ.. బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీలు ఆగకుండా వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలేటి రాములు, కమటం లక్ష్మణ్, నూకతొట్టి సాల్మన్‌రాజు, కొమ్ము పూలే, నీరుడి లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి



ఎంపీపీకు వినతిపత్రం అందజేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

తిరుమలాయపాలెం: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కంప్యూటర్ ఆపరేటర్లు మండల ఎంపీపీ బోడ మంగీలాల్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆలస్యం నాగేశ్వరరావు, గడ్డికొప్పుల రాజులకు వినతి పత్రాలు అందజేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ కృషి చేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి



నీటి నిల్వలను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్/కామేపల్లి: ఇంటి పరిసర ప్రాంతాల్లో ప్రతీ మూడు రోజులకోసారి నీటి నిల్వలు లేకుండా చూడాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ప్రజలకు సూచించారు. డ్రైడేలో భాగంగా శుక్రవారం ఖమ్మం నగరంలోని పలు డివిజన్‌లలో ఇంటింటికి తిరుగుతూ ఇంటి ఆవరణం, నీరు నిల్వ పాత్రలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ క్రమంలోనే 52వ డివిజన్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ప్రజలు డ్రైడేలో పాల్గొనాలని సూచించారు. అలాగే కామేపల్లి మండలం ముచ్చర్లలో సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీ ఆధ్వర్యాన పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ బుర్రి వెంకట్ కుమార్, ముచ్చర్ల పంచాయతీ కార్యదర్శి బానోత్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నీలి జెండా ఎగరేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్

ఖమ్మంరాపర్తినగర్: రానున్న ఎన్నికల్లో ఖమ్మం గడ్డ మీద నీలి జెండా ఎగరేయడం ఖాయమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేందర్ సహా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రకటించాక ప్రజల ఆలోచన విధానంలో మార్పు రావడం ప్రారంభమైందన్నారు. ఖమ్మం గెలుపుతో ఖమ్మంలోని అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని చెరిపివేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మేకతోట్టి పుల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమోహన్, ట్రెజరర్ సుభాని, జిల్లా మహిళా కన్వీనర్ బానోత్ రజిని, జిల్లా కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలేరు ఎమ్మెల్యే తీరు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న దండి సురేశ్

ఖమ్మంమయూరిసెంటర్: పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు సరికాదని, గులాబీ కండువలు కప్పుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని చెప్పడం స్వార్థ రాజకీయాలకు పరాకాష్ట అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు ఇస్తామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆయన జిమ్మిక్కులు సీపీఐ ముందు సాగవన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా నాయకుడు పుచ్చకాయల కమలాకర్, హనుమంతు రాము, సర్పంచ్ సంగయ్య, నాయకులు భద్రారెడ్డి, సీతారాములు, వెంకటేశ్వర్లు, ఎస్‌కె.జిలానీ, వెంకన్న, పుల్లయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం

నేలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపే తన ధ్యేయమని, టికెట్ ఎవరికి ఇవ్వాలనే అంశాన్ని అధిష్టానం చూసుకుంటుందని తెలిపారు. అయితే, పాలేరు రేసులో తాను ముందుండగా, అధిష్టానం కూడా తన పేరును పరిశీలిస్తోందని చెప్పారు. కాగా, పార్టీకిలోకి ఎవరొచ్చినా తమ నాయకులుగానే చూస్తామని, ఎప్పుడో అన్న మాటలను కొందరు రాజకీయ లబ్ధి కోసం ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను అధికార పార్టీతో తలపడ్డానని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు బచ్చల కూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, జెర్రిపోతుల సత్యనారాయణ, రాయపూడి నారాయణరావు, కందిమళ్ల హరిబాబు, సూరేపల్లి రవి, యాతాకుల శ్రీనాథ్, చిన్ననాయక్, పగిడికత్తుల సుదర్శన్, రమేష్, అప్పారావు, విజయ్, సంతోష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

బీఆర్ఎస్‌లో చేరిక

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరికి చెందిన 73 కుటుంబాలు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలకే సంక్షేమ పథకాలు

నేలకొండపల్లి: కేసీఆర్ ప్రవేశపెట్టే పథకాలన్నీ ఆయన కుటుంబం, బీఆర్ఎస్ నేతల కోసమేనని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు ఇంటింటికి తిరుగుతూ అధికారంలోకి రాగానే అమలు చేస్తారని ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కర్నాటి భానుప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం



మాట్లాడుతున్న బోడా పున్యానాయక్

కామేపల్లి: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఇల్లెందు నియోజకవర్గ జిల్లా నాయకుడు బోడా పున్యానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కామేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కేవలం బీఆర్ఎస్ నేతలకే అందిస్తూ.. అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ సూచనల మేరకే దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి వంటి పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ప్రతీ బీజేపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం భాజపా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జర్పుల రామారావు, నాయకులు భాగం రంగారావు, పోలూరి రామచంద్రయ్య, చిక్కి వెంకటేశ్వరరావు, ధరావత్ దావ్రాసింగ్, బానోత్ గణేష్‌నాయక్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల పరిషత్ సమావేశం

తిరుమలాయపాలెం: మండలకేంద్రంలో ఎంపీపీ బోడ మంగీలాల్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశానికి మండల ప్రజాపరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వచ్చిన కొద్దిమంది సభ్యులతోనే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైనంపల్లి ఎంపీటీసీ శంకర్ మండల పరిషత్‌కు వచ్చిన నిధుల వివరాలు తెలపాలని పట్టుబట్టారు. దీంతో ఎంపీపీ మంగీలాల్, ఎంపీడీఓ శ్రీనివాసరావులు స్పందించి వారం రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివరిస్తామని హామీ ఇచ్చారు. పశువైద్య అధికారుల తీరు బాగాలేదని, బచ్చోడు వెటర్నరీ డాక్టర్ గేదె విద్యుత్‌షాక్‌తో చనిపోతే పోస్టుమార్టం చేయకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని నిలదీశారు. ఎర్రగడ్డ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని చివరి గ్రామం కావడంతో నీరు సరిపోవడం లేదని సర్పంచ్ గడ్డికొప్పుల రాజు సమావేశం దృష్టికి తెచ్చారు. పలుశాఖల అధికారుల నివేదికలతో సమావేశం ముగించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పి.రామ్‌ప్రసాద్‌తో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ సీతారాంరెడ్డి

అంగన్‌వాడీల సమ్మె..



ఖమ్మంమయూరిసెంటర్: ఎంపీ నామా ఇంటి ఎదుట అంగన్‌వాడీల ఆందోళన

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలకు పలు ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఈ నెల 26లోగా సమస్యలు పరిష్కరించకుంటే 26న అంగన్‌వాడీల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

– ఖమ్మంరాపర్తినగర్/ కామేపల్లి/ ఖమ్మంమయూరిసెంటర్

వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేత

నేలకొండపల్లి: తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని, అందుకు ఈ నెల 25 నుంచి తాము సమ్మెకు దిగుతున్నట్లు ఆశ కార్యకర్తలు శుక్రవారం స్థానిక వైద్యాధికారి కె.రాజేశ్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీటు నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆశలను పారితోషికం పేరుతో శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని, కనీస వేతనాలు చట్టం ప్రకారం నెలకు రూ.18 వేల వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. సంఘం నాయకులు జ్యోతి, విజయ, విజయలక్ష్మి, కొండలరావు, నాగమణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా మత్స్య సొసైటీ ఎన్నికలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం రసవత్తర్ంగా జరిగాయి. సంఘం పరిధిలోని రాజారాంపేట, చెరువుమాధారం, మంగాపురంతండా, రాయగూడెం గ్రామాలకు చెందిన 832 మంది సభ్యులు ఉండగా.. 788 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 9 డైరెక్టర్ల స్థానాలకు గాను ఎస్టీ కేటగిరీకి చెందిన విభాగంలో మంగాపురంతండాకు చెందిన ధీరావత్ రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నిక కాగ.. 8 డైరెక్టర్లకు ఎన్నికలు నిర్వహించారు. మహిళ కేటగిరిలో యడవల్లి వెంకమ్మ, షేక్.తారలు ఎన్నిక కాగా.. జనరల్ కేటగిరిలో గొడుగు వెంకటరమణ, బాలబోయిన శేషయ్య, బోయిన బలరామమూర్తి, ఎండీ.ఖాసిం, యన్నబోయిన జనార్దన్, యన్నబోయిన పృథ్వీరాజ్‌లు విజయం సాధించారు. మొత్తం మీద సొసైటీ మాజీ అధ్యక్షుడు ఖాసిం ప్యానల్ ఘన విజయం సాధించింది. కూసుమంచి సీఐ జితేందర్ ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించగా.. అరుపులు, కేకలు, తోపులాటల మధ్య ఎన్నిక రసవత్తరంగా జరిగింది. కాగా, ఆఫీస్ బేరర్స్ ఎన్నికను నేడు(శనివారం) నిర్వహించేందుకు ఎన్నికల అధికారి ప్రసాద్ ఏర్పాట్లు చేశారు. అనంతరం గ్రామంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు